మార్చి13 నుంచి సైకాలజిస్టులకు శిక్షణ

హిమాయత్ నగర్ ఫిబ్రవరి16: రాష్ట్రంలోని సైకాలజిస్ట్ లు తమ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు మార్చి 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సైకాలజిస్ట్ అసోసీయేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైకాలజీ రంగంలో రాణించాలనుకునేవారికి ఈ నైపుణ్య శిక్షణ తర గతులు ఎంతో దోహదపడ తాయన్నారు. కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వం, ప్రేరణ, సృజనాత్మకత, శిక్షకుడి పాత్ర,బాధ్యతలు వంటి అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు.

నుమాయిష్ నేడు ఆఖరు

అబిడ్స్, ఫిబ్రవరి 16: అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన సోమవారంతో ముగియనున్నది. ప్రతి సంవత్సరం జనవరి ఒకటి నుంచి ఫిబ్రవరి 15 వరకు 40 రోజులు పాటు నిర్వహించే ఈ ప్రదర్శన గడువును పొడిగించిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 17 వరకు ఈ ప్రదర్శన సాగనుండగా ఆదివారం భారీగా సందర్శకులు తరలివచ్చారు.

18న గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభ

ఖైరతాబాద్, ఫిబ్రవరి 16 : తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18న ఇందిపార్కు వద్ద గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్ఆదివారం తెలిపారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు 2009లో ఇచ్చిన జీవో ప్రకారం గుర్తింపు సర్టిఫికేట్లు అందజేస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోవాలన్నారు. శిక్షణ పొందిన 13 వేల మంది కమ్యూనిటీ పారామెడికల్స్‌కు సర్టిఫికేట్లు ఇవ్వాలని, మిగిలిన వారందరికీ ఆరు మాసాల శిక్షణ అందించాలని, గ్రామీణ వైద్యులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలన్న డిమాండ్ తో ఈ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఫిబ్రవరి 17న కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఆదివారం వెంగళ్‌రావు నగర్ పార్కు లో మొక్కలు నాటిన ఎంపీ సంతోష్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు సతీశ్ రెడ్డి, దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్, కిశోర్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, జగన్ మోహన్ రావు, రజనీ సాయిచంద్, శ్రీదేవి, కర్నె ప్రభాకర్ తదితరులు

ప్రభుత్వ భూముల లెక్క తేలేనా?

జవహర్‌నగర్‌లో వేలాది ఎకరాల కబ్జా

- లేక్క తేల్చేందుకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం కసరత్తు
- 975 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు అంచనాకు వచ్చిన అధికారులు

మేడ్చల్, ఫిబ్రవరి16(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జాలపై లేక్క తెల్చేలా జిల్లా రెవెన్యూ యంత్రాంగం సిద్ధమైంది. జవహర్‌నగర్‌లో సుమారు 5,977 వేల ఎకరాల పైచిలుకు ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ రికార్డులలో ఉండగా మాజీ సైనికులకు అందించింది పోగా హెచ్ఎండీఏకు 2,370 ఎకరాలు, డంప్‌యార్డ్‌కు పోను మరో 2,500 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండాల్సి ఉంటుంది. 5 వేల ఎకరాల ప్రభుత్వ భూములు సుమారు 2 వందల సర్వే నెంబర్లలో ఉన్నాయి. అయితే ఇటివలే జవహర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ భూముల లేక్కను తెల్చేలా రెవెన్యూ బృందాలు పరిశీలించంగా సుమారు వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాలకు గురై అనేక అక్రమ నిర్మాణాలు వెలిసినట్లు గుర్తించారు. ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా ఉన్న భూములను ప్రజల ప్రయోజనాలకు ఉపయోగించేలా చర్యలు తీసుకునేందుకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం ప్రస్తుతం జవహర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ భూముల లేక్కను తెల్చి జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు సమర్పించినట్లు సమాచారం.

జవహర్‌నగర్ ప్రభుత్వ భూముల వివరాలను సర్కార్‌కు అందించనున్న జిల్లా యంత్రాంగం,,

జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూముల వివరాలను జిల్లా యంత్రాంగం త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిసింది. ప్రభుత్వ భూముల వివరాల నివేదికతో జిల్లా కలెక్టర్ గౌతమ్ ఇటివలే సమీక్ష సమావేశం నిర్వహించి పూర్తి వివరాలను సేకరించినట్లు సమాచారం. 5,977 ఎకరాల ప్రభుత్వ భూములలో ప్రస్తుతం ఉన్న భూములను లేక్కలతో తేల్చి నివేదికను సిద్ధం చేశారు. అయితే ప్రసుత్తం ఉన్న భూములలో ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగించేలా చూసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. రెవెన్యూ ప్రత్యేక బృందాలు కబ్జాచేసిన వారి వివరాలను నివేదికలో పోందుపరిచినట్లు తెలుస్తోంది.

వేల కోట్ల భూములు స్వాహా..

జవహర్‌నగర్‌లో వేట్ల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాలకు గురయ్యాయి. అప్పట్లో 1941లో మిలటరీ అవసరాల కోసం తీసుకున్న 5977 ఎకరాల భూమిని తిరిగి ప్రభుత్వానికి అప్పగించారు. 1958లో జవహర్‌నగర్ కోఆపరేటివ్ సోసైటి పేరిట వాటిని మార్చారు. దశల వారీగా 2004లో 2,370 ఎకరాలను హెచ్ఎండీఏకు కు ప్రభుత్వం అప్పగించింది. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న జవహర్‌నగర్‌కు అనేక సంస్థలు రావడంతో అ ప్రాంతమంతా డిమాండ్ పెరిగింది. దీంతో కబ్జాదారులు అప్పటి నుంచి భూములను కబ్జా చేస్తు నోటరీలపై విక్రయిస్తువస్తున్నారు. ఇలా వేల కోట్ల విలువైన 975 ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాలకు గురైనట్లు అధికారులు అంచనాకు వచ్చారు. 613, 614, 510, 432, 495 ఇలాంటి అనేక ప్రభుత్వ భూముల సర్వే నెంబర్లలో కబ్జాలకు గురై నిర్మాణాలు జరిగిన విషయం తెలిసిందే.

రెండ్రోజులు నీటి సరఫరాకు అంతరాయం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లయి ఫేస్-1లోని కొండపాక పంపింగ్ స్టేషన్ వద్దనున్న 3000 ఎంఎం డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్‌కు 900 ఎంఎం డయా వాల్వ్‌లు అమర్చనున్నారు. ఈ పనులు సోమవారం ఉదయం 6 నుంచి మరుసటి రోజు 18 (మంగళవారం) ఉదయం 6 గంటల వరకు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ 24 గంటలు పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని అధికారులు పేర్కొన్నారు. ఎస్ఆర్ నగర్, సనత్‌నగర్, బోరబండ, ఎస్ఆర్ హిల్స్, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, వెంగళ్‌రావు నగర్, ఎల్లారెడ్డిగూడ, సోమాజిగూడ, ఫతేనగర్, కూకట్‌పల్లి, భాగ్యనగర్, వివేకానందనగర్, ఎల్లమ్మబండ, మూసాపేట, భరత్‌నగర్, మోతీనగర్, గాయత్రీనగర్, బాబానగర్, కేపీహెచ్‌బీ, బాలాజీ నగర్, హస్మత్‌పేట్, చింతల్, సుచిత్ర, జీడిమెట్ల, షాపూర్‌నగర్, గాజులరామారం, సురారం, ఆదర్స్ నగర్, భగత్ సింగ్‌నగర్, జగద్గిరిగుట్ట, ఉషోదయ, అల్వాల్, ఫాదర్ బాలయ్యనగర్, వెంకటాపురం, మచ్చబొల్లారం, డిఫెన్స్ కాలనీ, వాజ్‌పేయినగర్, యాప్రాల్, చాణక్యపురి, గౌతంనగర్, సాయినాథపురం, చర్లపల్లి, సాయిబాబానగర్, రాధిక, కొండాపూర్, డోయెన్స్, మాదాపూర్, హఫీజ్‌పేట, మియాపూర్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, తూంకుంట, జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం, నిజాంపేట, బాచుపల్లి, ప్రగతినగర్, గండిమైసమ్మ, తెల్లాపూర్, బొల్లారం, ఎంఈఎస్, త్రిశూల్ వైన్స్, గన్‌రాక్, హకీంపేట ఎయిర్ ఫోర్స్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, బీబీనగర్ ఎయిమ్స్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. ఈ ప్రాంతాల ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.

ఆయా విభాగాలు సమన్వయంతో పనిచేయాలి

బల్దియా కమిషనర్ ఇలంబర్తి

మియాపూర్, ఫిబ్రవరి 16: కూడళ్ళ అభివృద్ధి సుందరీ కరణ పనులను పకడ్బందీగా చేపట్టేందుకు ఆయా విభాగాలు సమన్వయంతో పనిచేయాలని బల్దియా కమిషనర్ ఇలంబర్తి పేర్కొన్నారు. త్వరలో పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తు తగు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. హెచ్‌సి టి పనులలో భాగంగా శేరిలింగంపల్లి జోన్ పరిధిలో సుందరీకరించనున్న కూడళ్లను హెచ్‌ఎండిఏ సహా పలు శాఖల అధికారులతో కలిసి కమిషనర్ ఇలంబర్తి ఆదివారం పరిశీలించారు .ఈ సందర్భంగా ఆయన బస్సులో గచ్చిబౌలి త్రిబుల్ ఐటీ, డిఎల్ఎఫ్ ,ఖాజాగూడ, చందానగర్ లింగంపల్లి , ఆల్విన్ క్రాస్ రోడ్స్ సహా పలు కూడళ్లను కమిషనర్ పరిశీలించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని త్వరలో ఆరంభం కానున్న నేపథ్యంలో స్థల సేకరణ విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చడం కేబుళ్లు సహా ఇతర ఆటంకాలను తొలగించడం చేయాలని సూచించారు. కూడళ్ళు సుందరంగా అభివృద్ధి పరిచి ప్రజలకు ఆహ్లాదం కల్పించేలా తయారు చేయాలని పేర్కొన్నారు. హెచ్ సి టి పనులలో భాగంగా త్రిబుల్ ఐటీ జంక్షన్ జంక్షన్ వద్ద చేపట్టనున్న చేపట్టనున్న ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి ఆస్తుల సేకరణ ఇతర అనుబంధ పనులను అధికారులతో చర్చించారు. కూడళ్ళ అభివృద్ధికి ఆటంకం లేకుండా స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కమీషనర్ ఇలం భర్తీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్వరాజ్, పురపాలక శాఖ డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక, వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి, జాయింట్ సీపీ డేవిస్, చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, టి ఎస్ పి డి సి ఎల్ అధికారులు శేఖర్, పాండ్యన్, జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, రఘు ప్రసాద్ వేణుగోపాల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పట్టణ ప్రణాళిక ,ఇంజనీరింగ్ సహా ,డిప్యూటీ కమిషనర్లు ఏసీపీలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆదివారం ముషీరాబాద్‌లో చేపల మార్కెట్‌కు పోటెత్తిన జనం

ఆకట్టుకున్న ప్రజా పాట కు నృత్య నీరాజనం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 16: తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజాపాటకు నృత్య నీరాజనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ జాతీయ గేయ రచయిత రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడారు భారత దేశం లో 9 నృత్యాలున్నాయని అన్నారు.వాటిని శాస్త్రీయ నృత్యాలుగా గుర్తించిన భరతముని నాట్య శాస్త్రాన్నే.. అందరూ అనుసరిస్తారని అన్నారు.తెలంగాణ బాలోత్సవం ప్రజల వద్దకు ప్రజాపాటను శాస్త్రీయ నృత్య నీరాజనం పేరు తో తీసుకెళ్ళడం గొప్ప పరిణామ మని అన్నారు . కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నృత్య విద్యార్థులకు సర్టిఫికెట్,మెడల్ , మెమోంటోలు, దూరదర్శన్ న్యూస్ రీడర్ విజయ దుర్గ, అందజేసారు . తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షురాలు కే సుజావతి అధ్యక్షతన జరిగింది తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు ప్రదాన కార్యదర్శి ఎన్ సోమయ్య ,కోశాధికారి జి.బుచ్చిరెడ్డి ,తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షురాలు ఇ.మమత నృత్య గురువులు, రమణి సిద్ధి, తెలంగాణ బాలోత్సవం కల్చరల్ కొ ఆర్డినేటర్ ఇందిరా పరాశరం, నృత్య గురువులు రేణుక ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సినీ గేయరచయిత సుద్దాల అశోక్ తేజ

నకిలీ ఇన్సూరెన్స్..తేల్చేదెవరు?

ఇన్సూరెన్స్ కంపెనీలు, ఆర్టీఏ మధ్య సమన్వయ లోపం
నకిలీ బీమా పత్రాలతో నష్టపోతున్న వాహనదారుడు
వివరాలు ఇవ్వాల్సిందిగా కోరినా పట్టించుకోని కంపెనీలు
దళారులు ఏర్పాటు చేసే నకిలీ పత్రాలతో వాహనదారుడి జేబు గుల్ల

సిటీబ్యూరో, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : ఇన్సూరెన్స్ కంపెనీలు.. ఆర్టీఏ అధికారుల మధ్య సమన్వయ లోపంతో నకిలీ ఇన్సూరెన్స్ పత్రాలు పుట్టుకొస్తున్నాయి. బీమా కంపెనీల నిర్లక్ష్యం కారణంగా రవాణా అధికారులకు పనిభారం పెరుగుతున్నది. నకిలీ బీమా పత్రాలతో దళారీలు వాహనదారుల వద్ద డబ్బులు దండుకుని పనులు చేసిపెడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఏండ్లుగా సాగుతున్న ఇన్సూరెన్స్ పత్రాల దళారీ దందాపై అధికారులు పరిష్కారాలను గతంలోనే గుర్తించారు. అందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేశారు. కానీ అది కార్యరూపం దాల్చడం లేదు. ఇన్సూరెన్స్ కంపెనీలు తమ సమాచారాన్ని ఎప్పటికప్పుడు రవాణా అధికారులతో సమన్వయం చేసుకుంటే వంద శాతం మోసాలను అరికట్టే వీలుంది. ఆర్టీఏ వెబ్‌సైట్‌తో ఇన్సూరెన్స్ వివరాలు అనుసంధానం చేస్తే ఆయా ఆర్టీఏ కార్యాలయాల్లో వాహనాలు పరీక్షకు వచ్చినప్పుడు సంబంధిత నెంబర్ ఎంటర్ చేయగానే ఇన్సూరెన్స్ నకిలిదా? నిజమైనదా? అనేది తేలిపోతుంది. ఇన్సూరెన్స్ కంపెనీలు తమ క్లైంట్‌ల వివరాలు నేరుగా రవాణ వెబ్‌సైట్‌కు లింక్ చేయగలిగితే దళారుల మోసాలు ఉండవు. అలా చేస్తే ఇన్సూరెన్స్ అప్రూవల్ కాగానే ట్రాన్స్‌పోర్ట్ వెబ్‌సైట్‌లో అప్‌డేట్ అవుతుంది. ఈ విషయాలను ఆర్టీఏ అధికారులు బీమా కంపెనీల దృష్టికి తీసుకెళ్లినా వారి నుంచి స్పందన రావడం లేదు. దీంతో అధికారుల ఏమీ చేయలేకపోతున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా వాహనదారులు తక్కువ డబ్బులతో ఇన్సూరెన్స్ వస్తుందని అనుకుని జేబులు గుల్లా చేసుకోవడంతో పాటు బీమా పొందక నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవపల్‌మెంట్ అథారిటీ(ఐఆర్‌డీఏ), రవాణా శాఖ సమన్వయంతో పనిచేస్తేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని రవాణా నిపుణులు చెబుతున్నారు.

హై టెక్నాలజీ జరభద్రం..!!

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్‌నేరస్తులు బీమా కంపెనీలకు తెలియకుండానే వాటి పేర్ల మీద లక్షల రూపాయల దందా నిర్వహిస్తున్నారు. క్యూఆర్ కోడ్, కంపెనీ లోగో వివరాలు అన్నీ పొందుపరిచి ఆర్టీఏ అధికారులను మాయ చేస్తున్నారు. ఆయా వాహనాల యజమానుల పేరుతో బీమా పత్రాలు జారీ చేస్తూ దానిపై క్యూఆర్ కోడ్, చెల్లుబాటు అయ్యే తేదీలను ముద్రిస్తున్నారు. ఇలా ఒక్కో వాహనానికి వేలలో గుంజుతున్నారు. వాస్తవంగా బీమా కోసం ఒక్కొక్క వాహనదారుడు రూ.1500 నుంచి 5 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. దీని కాలపరిమితి ఏడాది. సాధరణంగా కొత్త వాహనమైనా.. పాత వాహనానికైనా కచ్చితంగా బీమా పత్రం ఉండాల్సిందే. లేదంటే మోటారు వాహన చట్టం ప్రకారం రవాణా శాఖ అధికారులు ఆయా వాహనాల రిజిస్ట్రేషన్ గానీ సామార్థ్యపు పరీక్షలు(ఫిట్‌నెస్) గానీ చేయడానికి వీలు లేదు. అయితే ఇక్కడే దళారులు, ఏజెంట్లు తమ దుర్బుద్ధిని చూపిస్తున్నారు. వాహనదారుడు తన వాహనానికి ఫిట్‌నెస్ పరీక్ష చేసుకోవడానికి ముందర ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత సర్టిఫికెట్లను జత చేయాలి. అవి అప్‌లోడ్ చేశాక నిర్ణయించిన తేదీన వచ్చి వాహన పరీక్ష చేయించుకోవాలి. ఆ క్రమంలో అతడు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లకు ఒరిజినల్ పత్రాలు చూపించాలి. ఫేక్ గాళ్లు తయారు చేసిన పత్రాలు అచ్చం ఒరిజినల్ మాదిరిగానే ఉండటంతో అధికారులు ఫిట్‌నెస్ పత్రాలు జారీ చేస్తున్నారు. కానీ అవి నిజమైనవా? కావా? అనేది తేల్చే వ్యవస్థ లేకపోవడంతో సమస్య జఠిలమవుతోంది. ఫలితంగా వాహనాలు ఆర్టీఏ, ఇన్సూరెన్స్ కంపెనీల కండ్లు కప్పి యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నాయి.

బీమా తప్పనిసరి..!!

గేటర్‌పరిధిలో 11 ఆర్టీఏ కార్యాలయాలున్నాయి. అవి హైదరాబాద్ జిల్లాలో ఖైరతాబాద్, సికింద్రాబాద్, మెహిదీపట్నం, మలక్‌పేట, చాంద్రాయణగుట్టా, బండ్లగూడ, నగర శివారులోని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ఉప్పల్, కొండాపూర్, ఇబ్రహీంపట్నం, మేడ్చల్(పేట్ బషీర్‌బాగ్)లు. రవాణా విభాగంలోని ఆటోరిక్షాలు, ట్రాలీలు, లారీలు, ఇతర సరుకు రవాణా వాహనాలకు ప్రతియేటా ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరి. ప్రతి రోజు కార్యాలయాలకు 200 నుంచి 500 వాహనాలు ఫిట్‌నెస్ పరీక్షలకు వస్తుంటాయి. ఈ సమయంలో వాహనం ఆర్సీతోపాటు చెల్లుబాటు అయ్యే బీమా పత్రం, కాలుష్య నియంత్రణ పత్రాలను అధికారులు పరిశీలించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. తక్కువ ధరకే బీమా పొందొచ్చని కొంత మంది వాహనదారులు అత్యాశక వెళ్లి మోసపోతున్నారు. అయితే ప్రమాదం సంభవించినప్పుడు అసలు విషయం తెలిసి వాహనదారులు లబోదిబోమనాల్సిన పరిస్థితి వస్తోంది.

వాహనదారుడికి తపన ఉండాలి: రమేశ్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్

వాహన యజమానులు కూడా తమ వాహనానికి సరైన ఇన్సూరెన్స్ చేయించుకోవాలనే తపన ఉండాలి. అథరైజ్డ్ వాళ్ల దగ్గరనే బీమా పత్రాలు చేయించుకోవాలి. అయితే నేరుగా ఇన్సూరెన్స్ కార్యాలయాల్లోనే సేవలు పొందాలి. ఆన్‌లైన్‌లో కూడా కచ్చితమైన వెబ్‌సైట్‌లను శోధించి బీమా దరఖాస్తు చేసుకోవాలి. ప్రముఖ కంపెనీల పేరు మీద కూడా నకిలీ వెబ్‌సైట్‌లు ఉంటాయి. అప్రమత్తంగా ఉండాలి. ఇన్సూరెన్స్‌కు ఇచ్చే ప్రీమియం కూడా డబ్బు కాకుండా ఆ కంపెనీ పేరు మీద చెక్ ఇస్తే మంచిది. వాహనదారులు ఏదైన జరగరాని ప్రమాదం సంభవించినప్పుడు బీమా వర్తించకపోవడంతో తప్పు చేశామని గ్రహిస్తున్నారు. మీ దగ్గరకు వచ్చి ఇన్సూరెన్స్ తక్కువ ధరకే చేయిస్తామని చెబితే అది మోసం అని గ్రహించాలి. సరైన ఇన్సూరెన్స్ పొందాలనే ఆలోచన వాహనదారుడికి ఉండాలి. బీమా వాహనదారుడికి రక్షగా బావించాలి. నిర్లక్ష్యం పనికిరాదు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి

శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 16 : ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. తెలంగాణముదిరాజ్ అడ్వకేట్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్ మాట్లాడుతూ సామాజికవర్గాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని, యువతను ప్రోత్సహించాలని, ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా న్యాయ సేవ, సలహాలు అందించాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్నారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ మాట్లాడుతూ ముదిరాజ్‌లు సంఘటితంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని అన్నారు. వర్గాలుగా విడిపోతే ప్రభుత్వాలు గుర్తించవని, ఏకతాటికపై వస్తే అడిగే స్థాయి నుంచి ఇచ్చే స్థాయి ఎదగవచ్చన్నారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా, విద్యపరంగా బలోపేతం కావాలని, విద్య ఉన్నత స్థానాల్లో నిలబెడుతుందన్నారు. భావితరాలకు స్ఫూర్తినింపేలా విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి కొరివి కృష్ణస్వామి ముదిరాజ్, పండుగ సాయన్న లాంటి వారి చరిత్రను వివరించాలన్నారు. ముఖ్యంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, ఇప్పటికే పార్లమెంట్ 33 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, స్థానిక సంస్థల్లో సైతం 50 శాతం రిజర్వేషన్లు ఉన్నాయని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవం సందర్భంగా ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన మహిళలను బాగస్వాములను చేసి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటైనా, కావాల్సిన నిధులు సాదించుకోవాలన్నారు. తెలంగాణ ముదిరాజ్ అడ్వకేట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ ఆంజనేయులు ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్, న్యాయవాదులు పాండు ముదిరాజ్, అర్జున్ కుమార్, శ్రీనివాస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సామల హేమ, ప్రొఫెసర్ మల్లికార్జున్, ఆంజనేయులు ముదిరాజ్ తదితరులు.